# రేషన్ కార్డు కేవలం కాగితం కాదు.. పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవం

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. రైతులు, మహిళలు, నిరుపేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం: సీఎం రేవంత్ రెడ్డి






సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం మైదానంలో శనివారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, అయితే పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని, రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతు భరోసా మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని, గత 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి సంబంధించి రూ.90 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని, రెండున్నరేళ్లలో రైతుల కోసం మొత్తం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా తమ ప్రభుత్వం రెండేళ్లలో సుమారు 7 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని, ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరుద్యోగ యువత మాయమాటలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తూ ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అన్నది ఆయన ఒక్కరి నిర్ణయం కాదని, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయిస్తుందని అన్నారు. రాహుల్ గాంధీతో జగ్గారెడ్డికి ఉన్న అనుబంధాన్ని రాముడు–హనుమంతుడి సంబంధంతో పోల్చిన ముఖ్యమంత్రి, ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడు ప్రజా జీవితంలో ఉండాల్సిన అవసరం ఉందని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 1980లో మెదక్ జిల్లా ప్రజలు ఇందిరాగాంధీకి బ్రహ్మరథం పట్టారని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పునాది పడిందని, పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించడంలో ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మహిళా సాధికారతలో భాగంగా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముందుకు సాగిందని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోతుందని, గత ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు అందించేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. రాష్ట్రంలో సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 1.06 కోట్ల రేషన్ కార్డులు అందిస్తున్నామని, రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు మంజూరు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు బోనస్ అందిస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్నధాన్యానికి బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సాంకేతిక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. టామ్‌టామ్ వంటి సంస్థల ద్వారా నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, శాసనసభ్యులు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## న్యూ బోధి స్కూల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ఆగస్టు 16 — సంగారెడ్డి పట్టణంలోని న్యూ బోధి పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు వివిధ దేశభక్తి విన్యాసాలు, ఉపన్యాసాలు, జాతీయ గీతాలాపనతో ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమరయోధుల సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో లింగం సార్, పాఠశాల కరస్పాండెంట్ రవి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సముదాయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ సంగీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నారని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని, ముఖ్యంగా యువత నూతన ఆలోచనలు, నైపుణ్యాలతో ముందుకు సాగుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణ లక్ష్యానికి అనుగుణంగా చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని, ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు తదితర వర్గాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.225 కోట్ల విలువైన రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రామకృష్ణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఖమ్మం: సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: ఆగస్టు 16 — రామకృష్ణాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో శెట్టి మనోహర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన సుధా సుస్మిత, ద్వితీయ స్థానం సాధించిన తూము త్రివేణికి నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందించారు. అదేవిధంగా తొమ్మిదో, ఎనిమిదో, ఏడో, ఆరో తరగతుల్లో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి, ఉపసర్పంచ్ గాదె రామారావు, పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కృష్ణవేణి, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి దేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. శెట్టి మనోహర్ ఫౌండేషన్ సభ్యుడు శెట్టి సురేష్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శెట్టి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా శెట్టి మనోహర్ ఫౌండేషన్ తరఫున ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దేశ సమగ్రత, ఐక్యతను కాపాడాలి



మెదక్: సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నే పోచయ్య: ఆగస్టు 16 — స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. మహిళలు, బాలికలు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తూ ప్రజల భద్రతకు ముందువరుసలో నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా బత్తుల కార్తీక్

చింతకాని: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇందులో భాగంగా చింతకాని మండలం జగన్నాథపురం రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బత్తుల కార్తీక్ జిల్లా స్థాయి ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. చేతుల మీదుగా బత్తుల కార్తీక్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రైతులకు వ్యవసాయ శాఖ పథకాలు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బత్తుల కార్తీక్‌ను జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్యతో పాటు రైతులు అభినందించారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్తీక్ తెలిపారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి



మెదక్: సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య: ఆగస్టు 16 — మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి ఆశయాల నుంచి స్ఫూర్తి పొంది దేశ అభివృద్ధి, ప్రగతిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎలాంటి ఘటన జరిగినా ముందుగా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలకు రక్షణ, సహాయ సహకారాలు అందించేది పోలీసులేనని తెలిపారు. అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో పోలీసు సిబ్బంది సహాయక బృందాల మాదిరిగా ముందుండి ప్రజలకు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. పోలీసులపై కొందరు ఎందుకు ప్రతికూలంగా మాట్లాడుతున్నారనే అంశంపై స్పందిస్తూ సమాజంలో పోలీసుల పాత్ర కఠినమైన తల్లిదండ్రుల మాదిరిగా ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లే పోలీసులు కూడా ప్రజల భద్రత, రక్షణకే అత్యంత ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. విద్యార్థులు ముగ్గురు కలిసి ఒకే వాహనంపై ప్రయాణించకుండా నిరోధించడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడవకుండా చూడటం, తప్పుదారి వైపు వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవడం ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాదని, ప్రాణాలను కాపాడటం, ప్రమాదాలను నివారించడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసులు తల్లిదండ్రుల మాదిరిగా ముందస్తు చర్యలు తీసుకుంటారని, అందువల్ల కొన్ని సందర్భాల్లో కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని అన్నారు. పోలీసుల కఠినత్వం వెనుక ఎల్లప్పుడూ ప్రజల భద్రత, సంక్షేమమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. "పోలీసు యూనిఫాం అంటే కేవలం ఉద్యోగం కాదు.. అది బాధ్యత, సేవ. ప్రజలకు, సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యత" అని అదనపు ఎస్పీ అన్నారు. సమాజంలో నేరాల స్వభావం వేగంగా మారుతోందని తెలిపారు. గతంలో వామపక్ష తీవ్రవాదం వంటి సవాళ్లు ప్రధానంగా ఉండగా ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆహార కల్తీ వంటి కొత్త తరహా నేరాలు, సవాళ్లు సమాజాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. మారుతున్న నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద కార్యకలాపాలు, సైబర్ మోసాలు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్లు మహేష్, రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## దానం నాగేందర్ లాంటి వారి వల్ల రాజకీయ నాయకులపై గౌరవం తగ్గుతోంది

సూర్యాపేట: సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: ఆగస్టు 16 — దానం నాగేందర్ లాంటి నాయకులను చూస్తే ప్రజల్లో రాజకీయ నాయకులపై ఉండే గౌరవం తగ్గిపోతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారని, ఇప్పుడు మళ్లీ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని ఆయన విమర్శించారు. ఇది ఎలాంటి రాజకీయమో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి వ్యవహారాల వల్ల రాజకీయాలపై ప్రజల్లో చులకన భావన ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఇలాంటి అంశాలపై ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు.

## శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




చింతకాని: సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్: ఆగస్టు 16 — చింతకానిలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. స్వాతంత్ర్యం దేశ ప్రజలకు పూర్తి స్వేచ్ఛను ప్రసాదించిందని, ఆ స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు జీవితంలో అభివృద్ధి సాధించాలని, మంచి విలువలు, క్రమశిక్షణను పాటిస్తూ తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ సరైన దిశానిర్దేశం చేయాలని కరస్పాండెంట్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు దుబ్బాక వాహిని రెడ్డి, తిరుపతిరెడ్డి, ఇనుకుల్ల సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ తన్నీరు రామారావు, వైస్ ప్రిన్సిపల్ చాపలమడుగు తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థినికి ఆర్థిక సహాయం: శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో చదువుతున్న చిన్నమండవ గ్రామానికి చెందిన స్మైలీ అనే విద్యార్థిని కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రముఖ న్యాయవాది మోర్ల వంశీకృష్ణ ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థిని చదువుకు అండగా నిలిచిన మోర్ల వంశీకృష్ణను పాఠశాల యాజమాన్యం అభినందించింది. దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, తల్లిదండ్రుల పట్ల గౌరవం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. అదేవిధంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



## పంచతత్వ వెంచర్‌లో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ

పటాన్‌చెరు: సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్: ఆగస్టు 16 — పటాన్‌చెరు మండలం ముత్తంగి జీహెచ్ఎంసీ పోచారం పరిధిలోని పంచతత్వ వెంచర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచతత్వ వెంచర్ సొసైటీ అధ్యక్షుడు కె. మల్లేష్ చారి చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కె. మల్లేష్ చారి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనను వెంచర్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కాలనీ సభ్యులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచతత్వ వెంచర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చందు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి వెంకట్‌రావు, పోచారం మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఉపసర్పంచ్ భవాని రాజ్, మాజీ ఎంపీటీసీ రామరాజు, పీఏసీఎస్ ఛైర్మన్ బిక్షపతి, కాలనీ సభ్యులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరులో ఘనంగా 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పటాన్‌చెరు: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, చైతన్యనగర్, సారాయి, ముదిరాజ్ బస్తీ, కృషి డిఫెన్స్ కాలనీ, పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ జైపాల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ సప్పన్నదేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ కృష్ణ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, స్థానిక పెద్దలు, పుర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరులో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా.. ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పటాన్‌చెరు: సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్: ఆగస్టు 16 — ప్రజల సహకారం, సమష్టి కృషితో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాలు, వివిధ సంక్షేమ సంఘాల కార్యాలయాలతో పాటు మైత్రి మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరులో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించే లక్ష్యంతో పటాన్‌చెరులో ప్రాథమిక పాఠశాల నుంచి పీజీ కళాశాల వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, పాలిటెక్నిక్ కళాశాల కూడా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడుతున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. స్థానిక స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలు క్రీడల ద్వారా లభిస్తాయని, ప్రతిభావంతులైన క్రీడాకారులు దేశానికి, రాష్ట్రానికి, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. క్రీడాకారుడికి రూ.50 వేల ప్రోత్సాహక బహుమతి: పటాన్‌చెరు పట్టణానికి చెందిన నర్రా వీరస్వామి ఇటీవల శ్రీలంకలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా రూ.50 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేసి అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి రూ.3.80 లక్షల నగదు బహుమతులను అందజేశారు. యువజన వికాస సమితి ఆధ్వర్యంలో 80 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ప్రత్యేక పరేడ్ అందరినీ ఆకట్టుకుంది. మార్చ్‌ఫాస్ట్ విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, మంజీరా హైస్కూల్‌కు ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు తృతీయ బహుమతి లభించాయి. సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పటాన్‌చెరుకు ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు తృతీయ బహుమతి లభించాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, క్రీడాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇస్నాపూర్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఇస్నాపూర్: సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ఆగస్టు 16 — ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఇస్నాపూర్ గడ్డం అరవింద్, 18వ వార్డు కౌన్సిలర్ మన్నె రాఘవేందర్, 17వ వార్డు కౌన్సిలర్ వెంకట్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లుట్లలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



శివంపేట: సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ఆగస్టు 16 — నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై తొలుత ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి, అనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని అన్నారు. సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి తదితర మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని పేర్కొన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, దేశ అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, యువకులు, గ్రామ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## దాదాయిపల్లిలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



టేక్మాల్: సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య: ఆగస్టు 16 — మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యారంగంలో రాణించినప్పుడే సమాజ వికాసంతో పాటు దేశ ప్రగతి సాధ్యమవుతుందని అల్లాదుర్గం సీఐ రేణుక అన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. టేక్మాల్ మండల పరిధిలోని దాదాయిపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ నర్సింహారావు దేశ్‌పాండే ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన విద్యార్థులకు ఉచితంగా సాధారణ సైకిళ్లతో పాటు 30 ఎలక్ట్రిక్ సైకిళ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలకు రూ.2.5 లక్షల విలువైన క్రీడా సామగ్రిని, అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్రిజ్‌ను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రేణుక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను గుర్తించి సొంత ఖర్చులతో సైకిళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు సమయాన్ని ఆదా చేస్తాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఐ రేణుక సూచించారు.



## దంతన్‌పల్లిలో ఆర్‌ఆర్‌ఆర్ కోల్డ్ స్టోరేజ్‌కు భూమిపూజ

శివ్వంపేట: సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ఆగస్టు 16 — శివ్వంపేట మండలం దంతన్‌పల్లి గ్రామంలో ఆర్‌ఆర్‌ఆర్ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామితో కలిసి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన నిల్వ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని నాయకులు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం కలగడంతో రైతులకు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఖాదిరాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



వట్‌పల్లి: సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ఆగస్టు 16 — వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2026 ఆగస్టు 15న నిర్వహించిన ఈ వేడుకల్లో భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణతో పాటు విద్యలో రాణించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖాదిరాబాద్ సర్పంచ్ మన్నె ఇందిరా, ఈశ్వరయ్య సార్, ఉపసర్పంచ్ బుక్క బిక్కుసాబ్, గ్రామ అధ్యక్షుడు పడమటి గాలయ్య, వార్డు సభ్యులు, వివిధ యువజన సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మేడికుంద గ్రామ పంచాయతీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వట్‌పల్లి: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — వట్‌పల్లి మండల పరిధిలోని మేడికుంద గ్రామ పంచాయతీ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 8.30 గంటలకు గ్రామ సర్పంచ్ శ్రీమతి నాలచెరు చంద్రకళ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ప్రజలు తమ హక్కులతో పాటు విధులను కూడా విస్మరించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ, పాఠశాల అధ్యక్షురాలు, వార్డు సభ్యులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, గ్రామ పెద్దలు, రేషన్ డీలర్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్: ప్రధాని మోదీ

వికసిత్ భారత్: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశానికి యువతే అతిపెద్ద శక్తి అని, యువత అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. 2014కు ముందు దేశంలో వైద్య విద్య సీట్లు సుమారు 400 మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 800కు పెరిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 350కు పైగా విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పేద విద్యార్థులు కూడా ఉన్నత విద్య, పోటీ పరీక్షల్లో రాణించేలా ఆన్‌లైన్ ద్వారా ఉచిత కోచింగ్ అందించే చర్యలు చేపడతామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. యువతకు మెరుగైన విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## రామచంద్రాపురంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



రామచంద్రాపురం: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురంలోని అఖిల్ టెంట్ హౌస్ ఎక్స్ రోడ్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు ముహమ్మద్ అబ్బు అలీ ఖురేషి, 112వ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి తొంట అంజయ యాదవ్ (బీఎస్పీ), వినయ్ కుమార్, షేక్ అకిల్, షేక్ సిరాజ్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు, రైతులు, వ్యాపారులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జాతీయ సమైక్యతను చాటుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



నర్సాపూర్: సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య: ఆగస్టు 16 — భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి ఎం. హేమలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం. హేమలత మాట్లాడుతూ భారత ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ ప్రజలు, ముఖ్యంగా తెలంగాణ ప్రజలు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని సాధించి తమ జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా జీవించేలా సమాజంలో పరస్పర సహకారం, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగం, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని, అదే సమయంలో రాజ్యాంగం పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతతో ప్రతి ఒక్కరూ తమ విధులను నిర్వర్తించాలని అన్నారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సమాజంలో శాంతి, న్యాయం, సమానత్వం నెలకొనేందుకు పౌరులు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం దేశభక్తి నినాదాలతో కోర్టు ప్రాంగణం మార్మోగింది.






## సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సాధికారతలో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.225 కోట్ల విలువైన బ్యాంకు అనుసంధాన రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టీజీఐఐసీ మాజీ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఫహీం, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంజయ్య, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వట్పల్లి డాన్ బాస్కో పాఠశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వట్పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — అందోల్ నియోజకవర్గంలోని వట్పల్లి మండల కేంద్రంలోని డాన్ బాస్కో పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గౌరవాన్ని చాటుకున్నారు. వేడుకల్లో విద్యార్థులు దేశభక్తి ప్రసంగాలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రైజ్ మనీ అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి జాతీయ గీతాన్ని ఆలపించడంతో వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పల్వాట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వట్పల్లి మండలం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని పల్వాట్ల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత ఆరు సంవత్సరాలుగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలను ఈ ఏడాది పునఃప్రారంభించగా, గ్రామ సర్పంచ్ రాణి మహిపాల్ ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా తన సొంత నిధులతో పాఠశాలకు పెయింటింగ్ వేయించడంతో పాటు విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు పాఠశాల బ్యాగులు, పలకలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. నర్సింలు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువ నాయకులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మహిళా సంఘాల అధ్యక్షులు, పాఠశాల శ్రేయోభిలాషులు తదితరుల సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలను పునఃప్రారంభించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ రాణి మహిపాల్‌ను గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## పోసానిపేటలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ జెండాలతో విద్యార్థుల భారీ ర్యాలీ.. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి.

పోసానిపేట, సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం ఆగస్టు 16: అందోల్ మండల పరిధిలోని పోసానిపేట గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, యువకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని ముదిరాజ్ సంఘం, క్రాంతి యువజన సంఘం, గొల్ల సంఘం, అంబేద్కర్ సంఘం, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రాంతాల్లో కూడా జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. పోసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, జాతీయ నినాదాలు చేస్తూ విద్యార్థులు గ్రామ వీధుల్లో ఉత్సాహంగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాతంత్ర్య సమర చరిత్రతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, పాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. జాతీయ జెండాలు, దేశభక్తి నినాదాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో పోసానిపేట గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.




## పోతులబోగుడలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



వట్‌పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 16: వట్‌పల్లి మండలంలోని పోతులబోగుడ గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముద్దాపురం రాజు తన సొంత నిధులతో జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు సౌండ్ బాక్స్‌ను, ఎంపీపీ పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం 42 అంగుళాల కలర్ స్మార్ట్ టీవీని అందజేశారు. అలాగే పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతిని బోయిన్ కీర్తనకు, ద్వితీయ బహుమతిని బోయిన్ మహేష్, పెద్దలోడి సౌజన్యలకు అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ ముద్దాపురం రాజు తెలిపారు. పాఠశాలలకు సౌండ్ బాక్స్, స్మార్ట్ టీవీతో పాటు విద్యార్థులకు నగదు బహుమతులు అందించడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సర్పంచ్ చేస్తున్న కృషిని గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బక్క దత్తు, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోసిగి శేఖర్, జడ్పీహెచ్ఎస్ మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ మాడే వీరన్న, వార్డు సభ్యుడు కోర్మని రాజు, చిత్రాల యాదగిరి, ధర్మ ప్రభాకర్ గౌడ్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుకన్య, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు విద్యాభారతి హైస్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పటాన్‌చెరు, సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్: ఆగస్టు 16 — పటాన్‌చెరు జేపీ కాలనీలోని విద్యాభారతి హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాభారతి జాయింట్ సెక్రటరీ కె. భూపాల్ రెడ్డి, కమ్యూనిటీ ప్రెసిడెంట్ టప్పు కుమార్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి ప్రసంగాలు, నృత్య కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. గత విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీజా నాయర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని అడ్డుకొని తీరుతాం అని సవాల్ చేసిన సంగారెడ్డి జిల్లా బిజెపి బిజెవైఎం నాయకులు



సంగారెడ్డి /ఆగష్టు16 సందేశం టైమ్స్,చౌటకూర్ మండల్రీ పోటర్ డి రమేష్ సంగారెడ్డి జిల్లా , సంగారెడ్డి జిల్లా బిజెపి బిజెవైఎం నాయకులను ముందస్తుగా పలు పోలీస్ స్టేషన్ లలో నాయకులను అరెస్టు చేయడం జరిగినది ఉమ్మడి పుల్కల్ మండలం పరిధిలోని చౌటకూర్ మండలం మండల అధ్యక్షులు నిరుడి ప్రవీణ్ కుమార్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ప్రభు గౌడ్ ఉమ్మడి పుల్కల్ మండలం మాజీ అధ్యక్షులు రాజు బీజేవైఎం మంగలి రమేష్ నాయకులు శ్రీనివాస్ అభిలాష్ సాయి గణేష్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేయడంతో పోలీస్ స్టేషన్ నుండి బిజెపి నాయకులు పోలీస్ స్టేషన్ నుండి నేరుగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి బయలుదేరడంతో తార్దన్ పల్లి టోల్గేట్ వద్ద పోలీసులు మళ్లీ అరెస్టు చేయడంతో దార్దన్ పల్లి వద్ద బిజెపి నాయకులకు పోలీసుల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు అలర్ట్ అయి నాయకులను స్టేషన్ కు తరలించడం జరిగినది



# జోగిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

జోగిపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి వి. వెంకటేశం: ఆగస్టు 16 — 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆందోల్ మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మహేష్కర్ పావని మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాలం, కృత్రిమ మేధ, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, చంద్రయాన్ వంటి అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరిగిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కుంట్ల లింగమయ్య, పద్మ జోగినాథ్, సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర మండలి సభ్యుడు రత్నాపూర్ జగన్నాథ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ ప్రభాత్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. ప్రభాకర్, ఆందోల్ నియోజకవర్గ కన్వీనర్ మహేష్కర్ సుమన్, ప్రధాన కార్యదర్శి మేదరి పాపయ్య, ఉపాధ్యక్షుడు మండల అర్జున్, మహిళా మోర్చా నాయకురాలు బండల మీన, కుక్కట్ల రమేష్, రాంసానిపల్లి మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి, రోళ్లపాడు సర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు. అలాగే భూమయ్య, వెంకటేశం, రాములు, రాజు, రవి, శ్రీకాంత్, శ్రీనివాస్, ఆంజనేయులు, రమేష్, జైపాల్, గోపాల్, జోగినాథ్‌తో పాటు పలువురు బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు.



# మరవెల్లి సీఎస్ఐ చర్చిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

మరవెల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — సంగారెడ్డి జిల్లా పరిధిలోని మరవెల్లి గ్రామంలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మల్లేశ్వరమ్మ, గ్రామ పెద్దలు, నాయకులు, చర్చి సంఘ పెద్దలు, యువజన సభ్యులు తదితరులు పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించడంతో వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో స్థానిక గురువు రెవ. యం. సదానందం, స్టీవార్డ్ రమేష్ బాబు, సంఘ పెద్దలు, స్త్రీల మైత్రి సభ్యులు, రాజా పటేల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిపేట మాజీ సర్పంచ్ సంగీత మల్లేశం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



సంగారెడ్డి, సందేశం టైమ్స్ జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: ఆగస్టు 16 — సాయిపేట గ్రామ మాజీ సర్పంచ్ సంగీత మల్లేశం జన్మదిన వేడుకలను స్థానిక అభిమానులు, గ్రామస్తులు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు, యువకులు సంగీత మల్లేశంను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సంగీత మల్లేశం చేసిన సేవలను కొనియాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. రాబోయే రోజుల్లో కూడా ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిలుకూరు చిన్నబడిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



చిలుకూరు, సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: ఆగస్టు 16 — చిలుకూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (చిన్నబడి)లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. బహుమతుల కోసం చిలుకూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి కొల్లు పుల్లమ్మ నాగయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గ వార్డు సభ్యులు కలిసి రూ.3,000 నగదును అందజేశారు. అలాగే పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న భవిత, సుమలతలు రూ.6,000 విలువైన మైకును పాఠశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, వార్డు సభ్యులు యడవల్లి ఉపేంద్ర, మరీదు శ్రీను, అంబాల భాగ్యమ్మ, కందుకూరి స్వప్న, షేక్ షాకీర్, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యలగొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుమలత, భవిత, రామారావు, ఓఎస్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు, మైకు అందించిన సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులకు పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# మరవెల్లిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వట్పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — వట్పల్లి మండలంలోని మరవెల్లి గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణ, అంబేద్కర్ చౌక్, సీఎస్ఐ చర్చి, రైతు వేదిక, జడ్పీహెచ్ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల తదితర ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు, ఆటపాటలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని జాతీయ జెండాకు వందనం చేసి వేడుకలను విజయవంతం చేశారు.

## చౌటకూర్ సీఎస్ఐ చర్చిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




చౌటకూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి డి. రమేష్: ఆగస్టు 16 — సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలోని చౌటకూర్ గ్రామంలో సీఎస్ఐ చర్చి వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి ఆవరణలో ప్రెస్బిటర్ ఇన్‌చార్జ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, మాణిక్యం, ప్రభు కిరణ్, పురుషోత్తం, గ్రామ సర్పంచ్, పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమైక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మెదక్ జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ఏఈఓ నవీన్ కుమార్




మెదక్-అల్లాదుర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 16 — వ్యవసాయ రంగంలో రైతులకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ మెదక్ జిల్లాకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నవీన్ కుమార్‌కు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, పంటల సాగులో ఆధునిక విధానాలు, ఎరువుల వినియోగం, పంటలపై అవగాహన కల్పించడంలో ఆయన చేసిన కృషికి ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ పంటల సాగు, చీడపీడల నివారణ, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడం ద్వారా నవీన్ కుమార్ ప్రత్యేక గుర్తింపు పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో సమన్వయం చేసుకుంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తమ ఏఈఓగా అవార్డు అందుకున్న నవీన్ కుమార్‌ను తోటి అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు అభినందించారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లో కూడా రైతుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని నవీన్ కుమార్ తెలిపారు.

## చౌటకూర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



చౌటకూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి డి. రమేష్: ఆగస్టు 16 — సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పార్కల రాంరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు అంబలి తాగేందుకు వీలుగా స్టీల్ గ్లాసులను అందజేయడంతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ప్రయోగశాలను ప్రారంభించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సర్పంచ్ తీసుకున్న చర్యలపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ అనురాధ, ఎమ్మార్వో నామాల కిష్టయ్య, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ పార్కల రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.